# రేపటి నుంచే.. ప్రజా పాలన

**జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ**


**పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న ఉమ్మడి జిల్లా యంత్రాంగం**

- వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలు
- తహసీల్దార్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు
- ప్రతి టీంలో రెవెన్యూ, వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్తు, పౌరసరఫరాల అధికారులు
- పర్యవేక్షకులుగా నోడల్ అధికారులు
- గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి దరఖాస్తుల స్వీకరణ
- వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు
- దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందజేయనున్న ప్రభుత్వం
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పర్యవేక్షకుడిగా మంత్రి శ్రీధర్‌బాబు

రంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలనకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 28 నుంచి వచ్చే ఏడాది జనవరి 6 వరకు అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రతి మండలానికి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఎంఈవోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. సోమ, మంగళ వారాలు సెలవు దినాలు అయినప్పటికీ వివిధ శాఖల ఆధ్వర్యంలో సమీక్షలు, సమావేశాలు కొనసాగాయి. ప్రతి మండలంలో నిత్యం రెండు గ్రామపంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించేలా షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. ఐదు పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమ పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా శ్రీధర్‌బాబును నియమించింది.

### ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు

మొదటి రెండు రోజులు చిన్న గ్రామపంచాయతీల్లో ఆతర్వాత పెద్ద గ్రామ పంచాయతీల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 30 గ్రామపంచాయతీలుంటే రెండు బృందాలను, అంతకుమించి గ్రామపంచాయతీలుంటే మూడు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ సందేశాన్ని చదివి వినిపించిన తర్వాత గ్రామ సభను ప్రారంభించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రక్రియను చేపట్టనున్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం వంద కుటుంబాలకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా స్వీకరించిన దరఖాస్తులను ఏ రోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 558 గ్రామపంచాయతీలు, 4,992 వార్డులుండగా.. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి పంచాయతీకి రూ.10వేల చొప్పున నిధులను కేటాయించింది.




### ప్రత్యేకంగా దరఖాస్తుల రూపకల్పన

ప్రజల నుంచి స్వీకరించే దరఖాస్తు ఫారాలను సైతం ప్రభుత్వమే ఉచితంగా అందజేయనున్నది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం దరఖాస్తులకు రూపకల్పన చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు జిరాక్స్‌లను జత చేయాల్సి ఉంటుంది. రేషన్ కార్డు లేకుంటే దరఖాస్తులో లేదని రాయాల్సి ఉంటుంది. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. ప్రస్తుతానికి మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ గృహాలు, చేయూత పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

## తెల్ల రేషన్ కార్డుంటేనే ఆరు గ్యారెంటీలకు అర్హులంటూ ప్రచారం

వికారాబాద్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు చేపట్టిన ప్రజా పాలనకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే సన్నాహక సమావేశాలను నిర్వహించిన జిల్లా యంత్రాంగం రేపటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 31, జనవరి 1 సెలవు దినాలు మినహాయించి ఎనిమిది పనిదినాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించారు. పథకాలకు సంబంధించి గ్రామాలు, పట్టణాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు తహసీల్దార్లు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను జిల్లా కలెక్టర్ నియమించారు. ప్రతి టీంలో రెవెన్యూ అధికారితో పాటు వ్యవసాయ, విద్య, వైద్య, విద్యుత్తు, పౌరసరఫరాల శాఖల అధికారులు ఉండనున్నారు. నేడు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో దండోరా వేయించడంతోపాటు సోషల్ మీడియా ద్వారా ప్రజాపాలన దరఖాస్తులపై ప్రచారం నిర్వహించేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. మరోవైపు దరఖాస్తులను స్వీకరించిన అనంతరం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి దశలవారీగా ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు అర్హులను ఎంపిక చేయనున్నారు.

### పర్యవేక్షణకు ప్రత్యేకాధికారుల నియామకం

దరఖాస్తుల పర్యవేక్షణకు నియోజకవర్గాలు, మండలాలు, మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి నియమించారు. వికారాబాద్ నియోజకవర్గానికి వికారాబాద్ ఆర్డీవో, తాండూరు నియోజకవర్గానికి తాండూరు ఆర్డీవో, పరిగి నియోజకవర్గానికి డీపీవో, కొడంగల్ నియోజకవర్గానికి డీఆర్‌డీవోను ప్రత్యేకాధికారులుగా నియమించారు. డీసీవోను వికారాబాద్ మున్సిపాలిటీకి, డీజీడబ్ల్యూవోను పరిగి, జీఎం డీఐసీని తాండూరు, అదనపు డీఆర్‌డీవోను కొడంగల్ మున్సిపాలిటీకి, జడ్పీ డిప్యూటీ సీఈవోను వికారాబాద్ మండలానికి, డీఎస్‌సీడీవోను ధారూరు, డీఎస్‌వోను కోట్‌పల్లి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను బంట్వారం, వికారాబాద్ డీఎల్‌పీవోను మర్పల్లి, డీఎఫ్‌వోను మోమిన్‌పేట్, డీబీసీడీవోను చౌడాపూర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీని పరిగి, డీఎండబ్ల్యూవోను పూడూరు, డీటీడీవోను దోమ, డీఆర్‌డీఏ ఏపీడీని కులకచర్ల, డీహెచ్‌ఎస్‌వోను తాండూరు, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీని యాలాల, జిల్లా సంక్షేమాధికారిని పెద్దేముల్, మార్కెటింగ్ ఏడీని కొడంగల్, తాండూరు పీఆర్ ఈఈని బషీరాబాద్, అదనపు డీఆర్‌డీవోను దౌల్తాబాద్, తాండూరు డీఎల్‌పీవోను బొంరాస్‌పేట, జిల్లా వ్యవసాయాధికారిని నవాబుపేట్ మండలానికి ప్రత్యేకాధికారులుగా నియమించారు.

### అర్హుల ఎంపికపై అనుమానాలు

ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు అర్హుల ఎంపికకు సంబంధించి ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు ఆరు గ్యారెంటీల పథకాల అర్హుల ఎంపికకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ప్రజల్లో సందిగ్ధం నెలకొన్నది. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చిన దృష్ట్యా తెల్ల రేషన్ కార్డులేని ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. గత కొన్నేండ్లుగా కొత్త తెల్ల రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో.. చాలా మంది ముందు తెల్ల రేషన్ కార్డులను జారీ చేసిన అనంతరం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని కోరుతున్నారు. నిజమైన పేదలకు ఆరు గ్యారెంటీ పథకాలు అందాలంటే తెల్ల రేషన్ కార్డులు ముందు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా తెల్ల రేషన్ కార్డును ప్రధానంగా పరిగణనలోకి తీసుకున్నట్లయితే చాలా మంది పేదలకు నష్టం జరిగే అవకాశాలున్నాయి. ఐటీ చెల్లించే వారికి తెల్లరేషన్ కార్డు రద్దు అవుతుందనే ప్రచారం కూడా జోరుగా జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు కూడా చాలా మంది బ్యాంకు రుణాల కోసం పాన్‌కార్డులు తీసుకోవడం, ఐటీ చెల్లిస్తున్న పరిస్థితుల దృష్ట్యా ఆరు గ్యారెంటీల పథకాలకు అర్హులెవరనే దానిపై తీవ్ర అయోమయం నెలకొన్నది.



అక్షతల వితరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్చకుడు రంగరాజన్

## శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ రోజును పండుగలా జరుపుకొందాం

**చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్**

మొయినాబాద్, డిసెంబర్ 26 : అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిరం ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆలయమని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయం వద్ద మంగళవారం అయోధ్యలోని భవ్యశ్రీరాముని అక్షతల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రామరాజ్యం రావాలని అప్పట్లో హిందువులు పలు సభల్లో వాగ్దానం చేశారన్నారు. అందరు కూడా జనవరి 22న పెద్దఎత్తున పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. 500 ఏండ్ల పోరాటం నెరవేరనుందని చెప్పారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఎంతో దివ్యంగా జరుగనుందని.. ఆ కార్యక్రమాన్ని వీక్షించడానికి ప్రతి గ్రామంలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామమందిరం నుంచి వచ్చిన అక్షతలు జనవరి 15వ తేదీ వరకు ప్రతి ఇంటికి చేరేలా చూడాలని తెలిపారు. శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన అయోధ్యలో జరిగిన తరువాత గ్రామానికి చేరుకున్న అక్షతలను తలపై వేసుకోవాలన్నారు. అక్షతలను శుభకార్యాలయాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రామభక్తులకు అక్షతలను ఆయన అందించారు. కార్యక్రమంలో అనంతగిరి జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి శ్రీలతారెడ్డి, హిందూ సంఘాల నేతలు అంజన్‌కుమార్‌గౌడ్, దశరథరెడ్డి, గున్నాల గోపాల్‌రెడ్డి, సహదేవ్‌గౌడ్, శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా పాలన విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రభుత్వం అందజేసే దరఖాస్తు ఫారం ప్రతి ఇంటికీ చేరాలి
- సన్నాహక సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆర్థిక ప్రగతి పెంచేందుకు చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం విజయవంతానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి ప్రజాపాలన కార్యక్రమంపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

### ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలి

అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా పాలన కార్యక్రమం కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో ప్రభుత్వ సెలవు దినాలు కావున ఆ రోజుల్లో కార్యక్రమాలు ఉండవని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ఒక దరఖాస్తు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు రెండు గ్రామపంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈవోలు, డిప్యూటీ తహసీల్దార్లు టీములుగా ఏర్పాటు చేసుకొని.. ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కింది స్థాయి ఉద్యోగి నుంచి పై స్థాయి అధికారుల వరకు అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు. ప్రతి 100 దరఖాస్తులకు ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులో విస్తృత ప్రచారం చేపట్టాలని, దండోరా చేపట్టాలని, ఒకరోజు ముందుగా టామ్ టామ్ వేయించాలని కోరారు. ప్రజాపాలనకు సంబంధించి ప్రతి కుటుంబానికి దరఖాస్తు అందేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మండల, మున్సిపల్ స్థాయిలో దరఖాస్తుల స్వీకరణలో, దరఖాస్తులను భద్రపర్చడంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ నివేదికలను ఏరోజుకారోజు పంపించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులకు రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. పోలీస్ సిబ్బంది దరఖాస్తులు తీసుకునే కౌంటర్ వద్ద బందోబస్తు క్రౌడ్ మేనేజ్‌మెంట్ చూడాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజాపాలనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో డీఆర్డీవో సంగీత, ఆర్డీవోలు సూరజ్ కుమార్, మల్లయ్య, శ్రీనివాస్, సాయిరాం, అనంత రెడ్డి, జడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, జిల్లా పంచాయతీపంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో సౌమ్య, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు